

స్థలాలిస్తే ఖాళీ చేసేస్తాం..

దుంపగడప నివాసితులు

ఆకివీడు : నివాసానికి స్థలాలు ఇస్తే వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోతామని దుంపగడప వద్ద జాతీయ రహదారి పక్కగా ఉన్న నివాసితులు తహశీల్దార్‌కు వివరించారు. శుక్రవారం మధ్యాహ్నం దుంపగడప రోడ్‌లో ఉన్న రోడ్డుపక్క ఇళ్లను తొలగించాలంటూ జాతీయ రహదారుల అధికారులు, స్థానిక రవీంద్ర అధికారులు నివాసితులకు సూచించారు. అయితే మరొక నెల రోజుల సమయం ఇవ్వాలని వారు కోరారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయిందని, కోర్టు ఆదేశాల మేరకు తాము తొలగిస్తున్నామని వారు తెలిపారు. ఈనెలాఖరు వరకు సమయం ఇవ్వాలని నివాసితులు కోరడంతో అధికారులు అంగీకరించి వెళ్లిపోయారు. అనంతరం నివాసితులు తహశీల్దార్ కార్యాలయంలో కలిసి తమకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే స్థలాలు, పట్టాలు సిద్ధమయ్యాయని, మౌళిక సదుపాయాలు కల్పించి ఇస్తామని తహశీల్దార్ వెంకటేశ్వరరావు నివాసితులకు తెలిపారు.

అందరి దృష్టి ఎంఎల్‌సి పోరుపైనే..!



ఉపాధ్యాయ ఎంఎల్‌సి బరిలో ఉన్న ఐదుగురు అభ్యర్థులు

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బరిలో నిలిచిన ఐదుగురు అభ్యర్థులు

ఎన్నికల ప్రచారం ముమ్మరం

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా గోపీమూర్తి సుడిగాలి పర్యటన

డిసెంబర్ 5వ తేదీన ఎన్నికల పోలింగ్, 9న ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - భీమవరం

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలపై అందరి దృష్టి పడింది. ఇప్పటికే గెలుపోవటములపై సార్వత్రా చర్చ సాగుతోంది. ఎంఎల్‌సి అభ్యర్థులు కూడా గెలుపు తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అందరి ఉపాధ్యాయులనూ కలుసుకుంటూ ఓట్లు అభ్యర్థిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ సాగింది. 19 నుంచి 21వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. ఉపఎన్నికల్లో కీలకమైన నామపత్రాలు ఉపసంహరణ ఘట్టం గురువారంతో ముగిసింది. అయితే నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో ఐదుగురు అభ్యర్థులు నిలిచారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా బొర్రా గోపీమూర్తి (భీమవరం), గంధం నారాయణరావు (ద్రాక్షారామం), నామన వెంకటలక్ష్మి (సామర్లకోట), కవల నాగేశ్వరరావు (రామచంద్రపురం), పులుగు దీపక్ (తాడేపల్లిగూడెం) బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారులు ధ్రువీకరించారు. అయితే ఇప్పటివరకూ నాలుగు సార్లు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలు జరిగాయి. తొలిసారిగా 2007లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నల్లమిల్లి శేషారెడ్డి గెలుపొందారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల లాటరీ వేయడంతో ఆయనకు రెండేళ్ల మాత్రమే పదవీ కాలం దక్కింది. తిరిగి 2009లో జరిగిన ఎన్నికల్లో చైతన్యరాజు ఎన్నికయ్యారు. 2015లో జరిగిన ఎన్నికల్లో రాము సూర్యారావు, 2021లో షేక్‌సాబ్జీ ఎంఎల్‌సిలుగా ఎన్నికయ్యారు. 2023లో షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో ప్రస్తుతం ఎన్నికలు అనివార్యమయ్యాయి. అయితే 2007 నుంచి జరిగిన ఎన్నికల్లో ప్రతిసారీ బరిలో 10 మంది వరకూ అభ్యర్థులు బరిలో ఉండేవారు. అయితే ప్రస్తుతం అయిదోసారి జరుగుతున్న ఈ ఎన్నికల్లో కేవలం ఐదుగురు మాత్రమే పోటీలో నిలిచారు. అయితే నియోజకవర్గం పరిధిలో కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు, 113 మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 16,316 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. డిసెంబరు 5న బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించనున్నారు. 9వ తేదీన ఓట్లు లెక్కింపు చేయనున్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తూ..

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా సామాజికవేత్త, విద్యావేత్త బొర్రా గోపీమూర్తి బరిలో నిలిచారు. అందరి తలలో నాలుకలా ఉన్న గోపీమూర్తి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి అందరినీ కలుపుకొని ప్రచారంలో దూసుకుపోతున్నారు. రాత్రీపగలూ తేడా లేకుండా తన ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో సుడిగాలి పర్యటన సాగిస్తున్నారు. దాదాపు 80 మండలాల్లో ఇప్పటికే ప్రచారాన్ని పూర్తిచేశారు. ఉపాధ్యాయ ఓటర్ల దగ్గరకు వెళ్లి ఓట్లు అభ్యర్థించడంలో తనకు తానే సాటిగా ముందుకెళ్తున్నారు. శాసనమండలిలో ప్రజా గొంతు నవ్వతానని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజానీక సమస్యలు పరిష్కారం కావాలంటే పిడిఎఫ్ ఎంఎల్‌సిలతోనే సాధ్యమని చెబుతూ తనకు అవకాశం కల్పించాలంటూ తనదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. గోపీమూర్తి విద్యార్థి దశ నుంచే సమరశీల భావాలు కలిగిన వ్యక్తి. ప్రాథమిక విద్య అంతా ప్రభుత్వ పాఠశాలలోనే అభ్యసించారు. భీమవరం డిఎన్ఆర్‌లో ఇంటర్మీడియట్, బిఎస్‌సి డిగ్రీ, ఏలూరు సిఆర్‌రెడ్డి కళాశాలలో బిఇడి పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఎస్‌సి మ్యాథ్స్ పట్టా, నాగార్జున యూనివర్సిటీ నుంచి ఎంఎస్‌సి కెమెస్ట్రీ పట్టా. ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం నుంచి ఎంఇడి పట్టా పొందారు. 1998లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేశారు. అత్తిలి మండలం కొమ్మర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ 12 ఏళ్లపాటు సర్వీస్‌ను స్వచ్ఛందంగా వదులుకున్నారు. యుటిఎఫ్‌లో అనేక పదవులు చేపట్టిన గోపీమూర్తి ఉద్యమాల పట్ల అంకితభావంతో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తనదైన శైలిలో పోరాడి ఫలితాలు సాధించారు. ఎదుటివారికి సాయం చేయడంలో గోపీమూర్తి పాత్ర ప్రత్యేకమైంది.

గోపీమూర్తి గెలుపుపై యుటిఎఫ్, పిడిఎఫ్ ధీమా

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రధాన భూమిక పోషిస్తున్న యుటిఎఫ్, పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన షేక్ సాబ్జీ అఖండ విజయం సాధించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనే విజయకేతనం ఎగురవేశారు. 2023 డిసెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో సాబ్జీ మృతి చెందారు. ఎంఎల్‌సి పదవీకాలం ఇంకా ఉండగా సాబ్జీ దాదాపు రెండున్నర ఏళ్లు మాత్రమే పదవిలో ఉన్నారు. ఇంకా దాదాపు మూడున్నరేళ్లు పదవీకాలం ఉండడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. అంతకు ముందు రాము సూర్యారావు పిడిఎఫ్ నుంచి గెలుపొందారు. ఈసారి జరగనున్న ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి బరిలో నిలిచారు. గెలిచిన అభ్యర్థి పదవీ కాలం 2027 మార్చి వరకూ మాత్రమే కొనసాగనుంది. అంతేకాకుండా ఉభయగోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రతిసారీ పిడిఎఫ్ బలంగా పోటీ ఇవ్వడమే కాకుండా విజయం సాధిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో గోపీమూర్తి విజయం తథ్యమనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు రైతు సేవా కేంద్రాన్ని, మిల్లులకు తరలిస్తున్న ధాన్యం లారీలను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సకాలంలో గోనెసంచులు ఇచ్చారా, సంబంధిత అధికారులు, సిబ్బంది మీ వద్దకు వచ్చారా, ధాన్యం డబ్బులు జమ అయ్యాయా అని జాయింట్ కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం అమ్మి మోసపోవద్దని, రైతు సేవ కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర పొంది ఆర్థికంగా బలపడాలని రైతులకు జెసి సూచించారు. రైతు సేవ కేంద్రంలో కొనుగోలు చేసే సమయంలో తూకం, తేమ శాతం, రికార్డుల నిర్వహణ, డేటా ఎంట్రీలను పరిశీలించారు. గోనె సంచులు, గోదాములను పరిశీలించి, చిరిగిన గోనె సంచులను వేరేచోట పెట్టాలని, ఎట్టి పరిస్థితుల్లో చిరిగిన గోనె సంచులను రైతులకు ఇవ్వొద్దని జెసి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు వారి ఖాతాలకు సొమ్ము జమచేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు వారి సమీప రైతు సేవ కేంద్రాన్ని సంప్రదిస్తే ధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బంది స్వయంగా కల్లాల వద్దకొచ్చి ధాన్యాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు అమ్మిన ధాన్యానికి 48 గంటల్లోపే బ్యాంకు ఖాతాలో సొమ్ము జమచేయడం జరుగుతున్నదన్నారు. జెసి వెంట తహశీల్దార్ ఎస్.భారతి విజయలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారి వి.నారాయణ రావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నేతలు

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ ఇంజినీరింగ్, ఇతర కార్మికులకు జిఒ 36 ప్రకారం రూ.21 వేల వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్, ఇతర కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇంజినీరింగ్, ఇతర కార్మికుల సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ పోస్టుల్లో కాంట్రాక్టు పద్ధతిన నియమించిన వారికి సుప్రీంకోర్టు చెప్పిన విధంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు యూనియన్ నాయకులు గుబ్బల గోపి, ఉండ్రాజవరపు శ్రీను, మీసాల పాపారావు, గెల్లా విజయకుమార్, రాపాక సురేష్, పడాల దానం, నాయుడు, చౌదరి, పెద్దపూడి వరప్రసాద్, దాసరి సత్యనారాయణ, అయినపర్తి రమణ, నాగరాజు పాల్గొన్నారు.

సూర్యనారాయణరాజు అంత్యక్రియలు పూర్తి

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మకు పలువురు పరామర్శ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖా సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తండ్రి భూపతి రాజు సూర్యనారాయణ రాజు అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ శుక్రవారం సాగాయి. గత కొంతకాలం నుంచి సూర్యనారాయణ రాజు అనారోగ్యానికి గురై హైదారాబాద్‌లో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. సూర్యనారాయణ రాజు భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి భీమవరం తీసుకొచ్చారు. కేంద్ర మంత్రి శ్రీనివాస్‌వర్మ స్వగృహం వద్ద తండ్రి భౌతికయాన్ని సందర్శనార్థం మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఉంచారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీస్ అస్మీ, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.రాహుల్ కుమార్ రెడ్డి సూర్యనారాయణ రాజు పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కేంద్ర మంత్రిని పరామర్శించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. వర్మ తండ్రి మృతి వార్త తెలియగానే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కుమారుడు భరత్ తదితరులు హైదరాబాద్‌లో ఆస్పత్రికి వెళ్లి ఆయనకు నివాళులర్పించారు.

సూర్యనారాయణ రాజు అంతిమయాత్ర..



మంత్రి శ్రీనివాస్ వర్మను పరామర్శిస్తున్న కలెక్టర్, జెసి

సూర్యనారాయణ రాజు అంతిమయాత్ర అశ్రునయనాల నడుమ సాగింది. బిజెపి నేతలు, నాయకులు, కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రజలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్ వర్మ స్వగృహం నుంచి ఆర్‌టిసి డిపో మీదగా ఓవర్ బ్రిడ్జి, బస్టాండ్ సెంటర్, పోలీస్ బొమ్మ సెంటర్, ప్రకాశం చౌక్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, గాంధీజీ చౌరస్తా, బాంబే స్వీట్ సెంటర్ మీదుగా బలుసు ముడి వరకూ అంతిమయాత్ర సాగింది. మోక్ష ధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

నేతలు, ప్రముఖుల నివాళి

సూర్య నారాయణరాజుకు నివాళులర్పించిన వారిలో ప్రముఖులు పొత్తూరి బాపిరాజు (బాంబే స్వీట్స్), సంఘ సేవకుడు చెరుకువాడ రంగసాయి, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు కుమారుడు సుందరరాజు, నర్సాపురం ఆర్‌డిఒ దాసి రాజు, బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, గోకరాజు రామరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజు, వేగేశ్న సీతారామరాజు, చెరుకువాడ వర్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా నాయకులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజా రామ్ మోహన్‌రాయ్, సిపిఐ నాయకుడు శ్రీనివాస్ వర్మ బ్యాచ్ మేట్ చెల్లబోయిన రంగారావు, టిడిపి రాష్ట్ర నాయకుడు మెంటే పార్థసారథి, టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, వెంకటేశ్వర దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మంతెన రామ్ కుమార్ రాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు నార్న తాతాజీ, సుబ్రహ్మణ్యం, బిజెపి జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ, బిజెపి ముఖ్య నేతలు సురేంద్ర, కోమటి రవి, సాయి ధర్మరాజు, హర్ష సుబ్రహ్మణ్యం, కె.నరసింహ, ఆర్.సత్యనారాయణ, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, అభిమానులు ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలి మృతి



చంద్రయ్య (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని కొమ్ము గూడెం గ్రామంలో గుండెపోటుతో ఉపాధి హామీ కూలి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్ముగూడెం గ్రామానికి చెందిన మేడంకుల చంద్రయ్య (70) ఉపాధి హామీ పనుల్లో భాగంగా ప్రధాన పంట కాలువ (మేజర్ కెనాల్) పూడికతీత పనిచేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుతో వచ్చింది. దీంతో ఒక్కసారిగా చంద్రయ్య కుప్పకూలి మతి చెందినట్లు కూలీలు తెలిపారు. చంద్రయ్య మృతికి కొమ్ముగూడెం గ్రామ సర్పంచి తాడేపల్లి బేబీ, టిడిపి నాయకులు తాడేపల్లి శ్రీను, గ్రామ కార్యదర్శి వాణి, విఆర్ఒ రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, ఎన్ఆర్ఇజిఎస్ అధికారి సుమలత సంతాపం తెలిపారు. అతని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.లిఉపాధిహామీ పనులలో భాగంగా పనిచేస్తుండగా గుండెపోటుతో మరణించిన మేడంకల చంద్రయ్య కుటుంబానికి ప్రభుత్వం నుండి సహాయం అందించి,ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లిసోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అల్లూరి స్థల పరిరక్షణకు చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పాలకోడేరు

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారక సంస్థకు చెందిన స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మోగల్లులో అల్లూరి స్మారక సంస్థ స్థలం ఆక్రమణకు గురవుతోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి సంస్థకు చెందిన దండు శ్రీనివాసరాజు, మంతెన యోగీంద్ర కుమార్‌లు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి అల్లూరి స్థలాన్ని, స్మారక భవనాన్ని పరిశీలించాలని సూచించడంతో ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్‌రెడ్డి మోగల్లులో పర్యటించారు. అల్లూరి సీతారామరాజుకు చెందిన స్థలాన్ని, స్మారక భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే సర్వే చేపట్టి ఆక్రమణలు గుర్తించి తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన మోగల్లులోని రైస్ మిల్లును పరిశీలించారు. అలాగే గొరగనమూడి రైతు సేవా కేంద్రాన్ని, శృంగవృక్షం రైస్‌మిల్లును పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి, ఆర్ఐ రాఘవరాజు, విఆర్ఒ సురేష్ పాల్గొన్నారు.



వినతినందజేస్తున్న నాయకులు

కార్మికులకు బోనస్ ఇవ్వాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రతాప్

ప్రజాశక్తి - తణుకు

20 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉన్న ప్రతీ పరిశ్రమ, సంస్థ, మాల్స్, షాపుల్లో పనిచేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం బోనస్ ఇవ్వాలని, లేకుంటే వారిపై అధికారులు చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(ఎఎల్‌ఒ) కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఎఎల్‌ఒ కిరణ్‌కుమార్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, గోపిలు మాట్లాడుతూ 2023-24 సంవత్సరాలకు గాను నవంబర్ నెలాఖరుకి 8.33(ఒక నెల వేతనం) చొప్పున చెల్లించాలన్నారు. కనీస బోనస్ చెల్లించడానికి లాభ, నష్టాలతో సంబంధం లేదని తెలిపారు. 2015 బోనస్ చట్ట సవరణ ప్రకారం రూ.21 వేలు లేదా ఆలోపు ఆదాయం వచ్చే ప్రతీ ఒక్కరికీ బోనస్ ఇవ్వాలన్నారు. ప్రయివేటు ఆసుపత్రి, విద్యాసంస్థల్లో పనిచేస్తున్నవారు పర్మినెంట్, డైలీవేజ్, ఎన్ఎంఆర్, పార్ట్‌టైం, కాంట్రాక్టు, పీస్ రేటు వారందరికీ బోనస్ ఇవ్వాలని తెలిపారు. సంవత్సరంలో 30 రోజులు లేదా అంతకంటే ఎక్కువ రోజులు చేసిన వారికి బోనస్ వస్తుందని తెలిపారు. కార్మికుల చట్ట ప్రకారం రావాల్సినవి, వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. పరిశ్రమలు, సంస్థలు వచ్చిన స్థూల లాభాల్లో 60 శాతం బోనస్ చెల్లింపు కోసం మిగులు పరిగణించబడుతుందని తెలిపారు. కనీస బోనస్ పోగా మిగులు ఉంటే కార్మికుల నిష్పత్తి ప్రకారం 20 శాతం బోనస్ చెల్లించాలని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరలు పెంచుతున్నప్పటికీ కార్మికులకు ఉన్న వేతనాలు, హక్కులు అమలు కావడం లేదని విమర్శించారు. ఎక్కడైనా బోనస్ ఇవ్వకపోతే సిఐటియు వారికి సమాచారం ఇవ్వాలని అన్నారు. అందుకే ఈనెల 26న పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో కార్మికులు పాల్గొనాలని ప్రతాప్, గోపి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీను, తిరుపతిరావు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

రిజిస్టర్లను పరిశీలించిన ఆర్‌డిఒ దాసిరాజు



పెనుమంట్ర : రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లాలో రైతుల నుంచి వ్యవసాయ శాఖ సేకరించిన ధాన్యానికి రైతుల ఖాతాలో 48 గంటల్లో డబ్బు జమ అవుతుందని ఆర్‌డిఒ దాసిరాజు వెల్లడించారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రాలలో వరి తేమశాతం తెలిపే టెక్నికల్ మిషన్‌లను, సంబంధించిన రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. ఇంతవరకు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ఎంత ధాన్యం సేకరించారు, సంబంధించిన రైతుల ఖాతాలలో 48 గంటలలో డబ్బులు జమ అవుతున్నాయా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని హితవు పలికారు. మండలంలో ఇంకా ఎంతమంది రైతులు వరి కోతలు కోయాలి, కల్లాల్లో ఉన్న ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు సంబంధించిన అధికారులు తెలుసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

గోనె సంచుల కొరత లేకుండా చూసుకోవాలి

వాతావరణంలో మార్పులు ఉన్నందున రైతులు తొందరపడి మధ్య దళారుల మాటలకు మోసపోకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్ముకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది అందరూ కలిసికట్టుగా పనిచేసి ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతం చేయాలని ఆర్‌డిఒ దాసిరాజును కోరారు. ఈ సందర్భంలో రైతు సేవా కేంద్రం సిబ్బందితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

నరసాపురం : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని, దళారుల చేతిలో మోసపోవద్దంటూ నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు కోరారు. శుక్రవారం మండలంలోని సీతారాంపురం నార్త్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆర్‌డిఒ విలేకర్లతో మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఉచితంగా ఖాళీ సంచుల్ని అందిస్తుందన్నారు. 75 కేజీల బస్తాను రూ.1,750కు కొనుగోలు చేస్తుందన్నారు. అయితే కొందరు దళారులు రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా రైతుల నుంచి కొనుగోలు చేసి ధాన్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తప్పవన్నారు. అన్ని కేంద్రాలో నియమించిన సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఎఒ జాన్సన్, ఆర్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు పరిశీలించారు. స్థానిక రైతులతో ఆయన మాట్లాడారు. గన్ని బ్యాగ్స్ రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఏవిధమైన ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. తరువాత భగ్గేస్వరం గ్రామంలోని సూర్యతేజ రైస్ మిల్లును సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 48 గంటల్లోపులో రైతు ఖాతాలకు నగదు వెళ్లాలని ఆదేశించారు. ఆర్‌డిఒ దాసిరాజుతో పాటు తహశీల్దార్ దుర్గా కిషోర్, విఆర్ఒ నాగరాజు, జోగారావు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో 108 ఉద్యోగుల నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

నరసాపురం : తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 108 ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నారు. శుక్రవారం నరసాపురం ఏరియా ఆసుపత్రి వద్ద 108 సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 25 నుంచి ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని ఇప్పటికే నోటీసుల్లో పేర్కొన్నారు. జీతాలు నేరుగా ప్రతినెల 5వ తేదీ లోపు చెల్లించాలని, పనిభారం తగ్గించాలి, 108 సర్వీసులను ప్రభుత్వమే నడపాలన్నారు. రోజుకు 12 గంటల పనిని ఎనిమిది గంటలకు కుదించాలి. సహజ మరణం, ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన జిఒ ఎంఎస్ నెంబర్ 49 ప్రకారం నెలకు నాలుగు వేలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రాజేష్, బి.సాగర్ పాల్గొన్నారు.

ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన ఎంపిడిఒకు వినతి




మొగల్తూరు : వినతిని అందజేస్తున్న ఎఎన్ఎంలు

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామాల్లో పనిచేసే ఎఎన్ఎంలకు ఇతర శాఖలకు సంబంధించి పనులు, సర్వేల నుంచి మినహాయింపు ఇవ్వాలని శుక్రవారం నరసాపురం ఎంపిడిఒ జివిఎస్ రామకృష్ణంరాజుకు వినతిపత్రం అందించారు. సిఐటియు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన పనులకు మాత్రమే తమను వినియోగించుకోవాలన్నారు. అంతేగాని ఇతర పనులు మాకు అప్పచెప్పడం వల్ల ఒత్తిడికి గురి అవుతున్నామన్నారు. వీటి నుంచి విముక్తి కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, ఎఎన్ఎంలు ఆర్.భాగ్యలక్ష్మి, త్రివేణి, శాంతిలక్ష్మి, బుజ్జమ్మ, విజయలక్ష్మి, రామలక్ష్మి, దుర్గాలక్ష్మీబాయ్, ప్రమీల, వెంకటేశ్వరమ్మలు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న గ్రామ, వార్డు, ఆరోగ్య కార్యదర్శులు, గ్రేడ్-3 ఎఎన్ఎంల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ కోరారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన శుక్రవారం సాయంత్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యశాఖ సిబ్బందితో శాఖాపరమైన సేవలు చేయించాలని అన్నారు. సిబ్బందితో ఆన్‌లైన్ యాప్‌లు, సర్వేలు, ఇతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇతర పనుల ద్వారా ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్.భాగ్యలక్ష్మి, ఆర్.త్రివేణి, పి.దుర్గా లక్ష్మి, వై.సత్యవతి, బి.హేమ దుర్గాదేవి, కె.స్వర్ణలత, ఎం.సునీత కుమారి, వి.సునీత, నీలిమ పాల్గొన్నారు.

పాలకొల్లు : సచివాలయం పరిధిలో పనిచేస్తున్న విలేజ్, వార్డ్ హెల్త్ సెక్రటరీ గ్రేడ్ 3 ఎఎన్ఎంలను వైద్య ఆరోగ్య శాఖాపరమైన సేవలే ప్రజలకు చేయించాలని కోరుతూ పాలకొల్లు ఎంపిడిఒ సోమేశ్వరరావుకు సిపిఎం నేతలు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. పంచాయతీరాజ్ శాఖ, ఇతర శాఖల ఆన్ లైన్ యాప్ సర్వేలు, ఇతర పనుల నుంచి వీరిని మినహాయింపు ఇవ్వాలని కోరారు. మండల సిపిఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ రకరకాల ఆన్‌లైన్ యాప్ ద్వారా సర్వేలు చేయడం వల్ల వారికి పనిభారం ఎక్కువ అవుతుందని, మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. ఆర్.భాగ్యలత, శిరీష పాల్గొన్నారు.



పాలకొల్లులో..

పాడైపోయిన రోడ్లు నిర్మించాలి

సిపిఎం పట్టణ నాయకులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పట్టణంలో పాడైపోయిన రోడ్లను వెంటనే నిర్మాణం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్లో శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి వాసుదేవరావు మాట్లాడుతూ ఎన్డిఎ కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి పాడైపోయిన రోడ్లను మరమ్మతు చేయాలన్నారు. రోడ్లు పాడైపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. గత ప్రభుత్వం రోడ్లను వేయకుండా నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం ఆ విధానాన్ని కొనసాగిస్తున్నదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలో పాడైపోయిన రోడ్లను వెంటనే నిర్మాణం చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠ రావు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, బి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

పెన్షన్ దారులు హర్షం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో నవంబర్ నుంచి కూటమి ప్రభుత్వం పెన్షన్ లబ్ధిదారులకు ఊరట కలిగేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పూర్ణ బబ్లి శుక్రవారం విలేకరులకు తెలిపారు. పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులు అనారోగ్య కారణాలవల్ల మొదటి రెండు నెలలు పెన్షన్ తీసుకోకపోయినా ఆ పెన్షన్ మూడో నెలలో మొదటి రెండు నెలలు కలిపి ఒకేసారి తీసుకొనే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తూ జిఒ. జారీ చేసింది. ఈనెల నుంచి అమలు జరిగేలా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. కాగా పెన్షన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని అనారోగ్యంతో, లేదా ఏదైనా ఇతర కారణాల వల్ల మృతి చెందితే యజమాని పెన్షన్ భార్యకు వర్తిస్తుందని, మరుసటి నెలలోనే వితంతు పెన్షన్ మంజూరు అవుతుందని ఆయన తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

గ్రామాల్లోని సమస్యలపై ఆరా

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పలు వార్డుల్లో నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించారు. స్వయంగా కమిషనర్ ప్రజల వద్దకు వెళ్లి పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల మరమ్మతులు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు వెంటనే వాటిని పరిష్కరించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, సానిటరి మేస్త్రి కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒబిసి కులగణన చేపట్టకపోవడం దారుణం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్ళు గడిచినా ఒబిసి కులగణన చేపట్టకపోవడం కేంద్ర ప్రభుత్వాలకు బిసిలపై వున్న చిత్తశుద్ధి ఎలాంటిదో అర్థమవుతుందని పశ్చిమగోదావరి జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు వడ్డిపల్లి శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెంలో జరిగిన బిసి కులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేవలం బిసిల ఓట్లతో గద్దెనెక్కిన ప్రతి రాజకీయ పార్టీలు అధికారం చేజిక్కిన తరువాత బిసిలను మోసం చేస్తున్నాయని, ఇప్పటికైనా ఏకీకృతం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 25వ తేదీన రాష్ట్రంలో వున్న 25 కలెక్టరేట్ల వద్ద మెమొరాండం ఇచ్చి తమ నిరసన తెలుపుతామని, అప్పటికి ప్రభుత్వం కులగణన చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా బిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

సూర్యనారాయణ రాజు మృతికి సంతాపం

మొగల్తూరు : కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తండ్రి సూర్యనారాయణ రాజు శుక్రవారం మృతి చెందారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని క్షీరశైలం కేంద్ర మాజీ మంత్రి యు.వి.కృష్ణంరాజు ఇంటి వద్ద ఏర్పాటుచేసిన సంతాప సభలో పలువురు బిజెపి నాయకులు సూర్యనారాయణ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హైదరాబాద్‌లో ఉన్న కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి విలేకరులతో ఫోన్లో మాట్లాడారు. సూర్యనారాయణ రాజు తనకు తండ్రి వంటి వారనన్నారు. ఆయన మృతి తీరనిలోటని తెలిపారు. ఈ సందర్భంగా సంతాపం వ్యక్తం చేశారు. కవురు శ్రీనివాసరావు, మామిడిశెట్టి నరసింహ రావు, దుసనపూడి సూర్యనారాయణ, దొంగ రామారావు, నాగేశ్వరరావు, జేమ్స్ రాజు, పట్టేపు ముత్యాలరావు పాల్గొన్నారు.

భీమవరంలో ఈశా గ్రామోత్సవం

భీమవరం : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద క్రీడా ఉత్సవం మన భీమవరంలో ఈనెల 23, 24 తేదీలలో డిఎన్ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనునట్లు ఈశా భీమవరం కోఆర్డినేటర్ డాక్టర్ విజయ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జెసి రాహుల్ కుమార్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈమేరకు ఈశా వాలంటీర్లతో కలిసి కోఆర్డినేటర్ విజయ శుక్రవారం ఒక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్లో 13 జిల్లాలలో విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ఏలూరు, విజయవాడ, అనంతపురం, వైఎస్ఆర్, ఒంగోలు జిల్లాలలో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. ప్రతీ స్థాయిలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు మెరిట్ సర్టిఫికెట్, నగదు బహుమానం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మొదటి రెండు జట్లకు ఈశా రిజువినేషన్ ట్రోఫీ కూడా అందిస్తున్నామన్నారు. వేలాది మంది సమక్షంలో ఫైనల్ ఈవెంట్ డిసెంబర్ 28న ఈశా యోగా సెంటర్, కోయంబత్తూరులోని ఆదియోగి వద్ద నిర్వహించనున్నామని తెలిపారు. విజేత జట్లకు నగదు బహుమతులు వాలీబాల్ (పురుషులు): రూ.5 లక్షలు, త్రోబాల్(మహిళలు) రూ.5 లక్షలు అందజేయనున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మొత్తంగా కోటి రూపాయలకుపైగా నగదు బహుమతులను అందజేస్తున్నట్లు వెల్లడించారు.

ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు పోటీలు

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో సిసిఇ, ఎపి, మంగళగిరి వారి ఆదేశాల మేరకు 'వరల్డ్ ఎయిడ్స్ డే' పురస్కరించుకుని ఈనెల 22 నుంచి 30 వరకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి వరల్డ్ ఎయిడ్స్ డే డిసెంబర్ 1న బహుమతులు అందజేస్తామని చెప్పారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని వారి ఆలోచనలను పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, బోటనీ విభాగాధిపతి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో పిఎసి చైర్మన్ అంజిబాబు

భీమవరం టౌన్ : భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజి బాబు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులై, భీమవరం వచ్చి నేరుగా మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు వీరికి పూజలు నిర్వహించి, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌కు ఘన స్వాగతం

ఉండి: డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత నియోజకవర్గానికి వచ్చిన ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు కూటమి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు మాట్లాడుతూ తమ నాయకునికి డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని డిప్యూటీ స్పీకర్‌కు ఘనస్వాగతం పలికి, సంబరాలు చేసుకున్నారు.

నేరాలు - ఘోరాలు

భర్తపై కేసు నమోదు

ఉండి: భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదైన సంఘటన ఉండి మండలం మహదేవపట్నం శివారు రామచంద్రపురంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొప్పన లక్ష్మీ దుర్గ అనే వివాహితను తన భర్త శ్రీనివాస్ ప్రతిరోజు తాగి వచ్చి హింసిస్తున్నాడన్నారు. ఈనెల 19వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో చిత్రహింసలకు గురి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీ దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త శ్రీనివాస్‌పై ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆసుపత్రి శుభ్రం చేస్తాం..

ప్రజాశక్తి వార్తకు స్పందన


ప్రజాశక్తి - ఆకివీడు

మండల కేంద్రం ఆకివీడులో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రంలో అనారోగ్య పరిస్థితులను వెంటనే సరిచేస్తామని ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ ఎవిఎస్.గణేశ్వరరావు తెలిపారు. గురువారం ప్రజాశక్తి పత్రికలో 'అధ్వాన్నంగా సామాజిక ఆరోగ్య కేంద్రం' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని, అంశాల వారిగా వివరణ ఇచ్చారు. మురికి తొలగిస్తామని, అందరికీ సదుపాయాలు కల్పిస్తామని ఆ ప్రకటనలో తెలిపారు.

దీపం-2 పథకాన్ని వినియోగించుకోవాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జెసి

ప్రభుత్వం అందిస్తున్న దీపం-2 పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ 31వ వార్డు దుర్గాపురంలో దీపం పథకం-2లో ఉచిత గ్యాస్ సిలిండర్ పొందిన సుమారు పదిమంది లబ్ధిదారుల కుటుంబాలను కలిసి మాట్లాడారు. మీరు ఏమి పనులు చేస్తారు, మీ కుటుంబాలు సంతోషంగా ఉన్నాయా, పిల్లలను బాగా చదివిస్తున్నారా, దీపం పథకం-2లో భాగంగా దీపావళి కానుకగా ప్రభుత్వం ఉచితంగా అందించిన గ్యాస్ సిలిండర్ వల్ల మీకు ఉపయోగంగా ఉందా, గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన డబ్బులు మీ బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయా, చూసుకున్నారా అని లబ్ధిదారుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మీ ప్రాంతంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యం, కందిపప్పు, పంచదార కార్డుదారులందరు తీసుకోవాలన్నారు. అలాగే శానిటేషన్, తాగునీరు వంటి ఏమైనా ఇబ్బందులు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈయన భీమవరం తహాశీల్దార్ రావి రాంబాబు, ఆర్ఐ ఎ.సురేష్ ఉన్నారు.

నవుడూరులో కొనసాగిన ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - వీరవాసరం

నవుడూరు వద్ద వీరవాసరం-పెనుమంట్ర ఆర్అండ్‌బి రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణల తొలగింపు తుది దశకు చేరుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మాణిక్యం మూడవ నోటీసు ఆక్రమణదారులకు అందజేశారు. ఇప్పటికే గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శి రెండు నోటీసులు ఇవ్వడం జరిగింది. ఆక్రమణలు తొలగించాలంటూ హైకోర్టు ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈనెల 23న పంచాయతీ కార్యలయం వద్ద ఆక్రమణదారులు అభ్యంతరాలు, ఆక్రమణ స్థలంకు సంబంధించి ఏమైనా హక్కులుంటే పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకురావచ్చునంటూ వారికి అవకాశం ఇచ్చినట్లు కార్యదర్శి తెలిపారు. ఈవిధంగా 39 మంది ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు అందజేయడం జరిగిందన్నారు. తదపరి ఆక్రమణ తొలగింపుకు ఆర్అండ్‌బి అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కార్మిక చట్టాలు, నాలుగు లేబర్ కోడ్ల విధానాలను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 26వ తేదీన నాలుగు సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందని సిఐటియు నాయకులు చల్లా చంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు ఉపాధ్యక్షులు సిరవరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, అల్లు సుబ్బారావు మాట్లాడుతూ నేషనల్ మోనిటైజేషన్ విధానం రద్దు చేయాలని, దుర్మార్గమైన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించి, అమలు చేయాలని అన్నారు. విశాఖ స్టీల్ ప్రయివేటీకరణను ఆపాలని, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, వెలుగు నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష ఉపాధి హామీ తదితర స్కీన్ వర్కర్లు ఉద్యోగాలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. తదితన డిమాండ్లు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కరక వెంకటరావు, బేతా అప్పారావు, కేతిరెడ్డి అప్పన్న, గొర్ల రమేష్, వైగల వెంకటేశ్వరరావు, దౌర్ల సీతయ్య, పెనగంటి దుర్గ, మీసాల శ్రీను పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దిగమర్రు గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను శుక్రవారం ఎన్‌డిఎ కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి రామానాయుడు ఆదేశాలకనుగుణంగా ధాన్యం అమ్మకంలో రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎఒ పార్వతి, సర్పంచి కౌరు భారతి భాస్కర్ బాబు, సర్పంచి రాపాక కరుణాకర్, కోడి విజయభాస్కర్, పాములు రజినీకుమార్, కౌరు మురళీ, రాపాక డేవిడ్ రాజు, తమ్మినీడి చంద్రశేఖర్, మానేం కిషోర్, కేత వీర రాఘవులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకాల్లో రైతులకు ప్రాధాన్యతివ్వాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ధాన్యం అమ్మకాలలో రైతులకు అధిక ప్రయోజనం చేకూరేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విసి అండ్ ఎండి డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. శుక్రవారం పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాల్లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ విసి అండ్ ఎండి డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ విస్తృత పర్యటన చేసి కోతకు వచ్చిన పంట పొలాలు, నూర్పిడి కళ్లాలు, రైస్ మిల్లు, సిడబ్ల్యూసి బఫర్ గోడౌన్‌లను సందర్శించి రైతులతో, రైస్ మిల్లర్‌తో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా విసి అండ్ ఎండి డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర కచ్చితంగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడులో కోతకు వచ్చిన పంటను పరిశీలించిన అనంతరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రయోజనం చేకూరేలా అధికారులందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

భీమవరం : కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు భీమవరం టౌన్ కమిటీ సమావేశం టౌన్ అధ్యక్షులు ఎస్.సిరీస్ అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులపై దాడి తీవ్రతరం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలు సవరిస్తూ యాజమాన్యాలకి ఉపయోగపడే విధంగా చట్టాల మార్పును తీవ్రంగా వ్యతిరేకించి, పోరాడాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు టౌన్ కార్యదర్శి బి.వాసుదేవరావు, సిఐటియు టౌన్ నాయకులు కలిపిండి సత్యనారాయణ, కోర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 100 రోజులు పని చూపించాలి

వ్యకాస ఆధ్వర్యాన సర్పంచికి వినతి

ప్రజాశక్తి - పెనుగొండ



సర్పంచికి వినతిని అందజేస్తున్న వ్యకాస నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనిలో 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు 'ఉన్నతి' కార్యక్రమంలో భాగంగా 3 నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి రూ.9 వేలు అందజేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. ఈమేరకు వడలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి, వరలక్ష్మి గ్రూపు ఉపాధి మేటు కాసాని వరలక్ష్మి సర్పంచికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు షేక్ పాదుషా మాట్లాడుతూ అన్ని కుటుంబాలకు పని ఇచ్చే విషయంలో ప్రభుత్వం 100 రోజుల పని చాలా కుటుంబాలకు చూపించిన పరిస్థితి లేదన్నారు. ఇతర రకాల వ్యవసాయ పనులు చూపించడం ద్వారానే అందరికీ పనులు కల్పించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వంద రోజులు పూర్తి చేసుకున్న వారికి 'ఉన్నతి' కార్యక్రమం కొన్ని కుటుంబాలకే పరిమితం చేయకుండా ఉపాధి పనిచేసే అన్ని కుటుంబాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, నిత్యావసరాల ధరలు, విద్యుత్ ఛార్జీలు, వైద్యపరమైన ఖర్చులు బాగా భారమయ్యాయన్నారు. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ పనిని మరో వంద రోజులు పొడిగించి, ఉపాధి కల్పన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కార్మికులు మాదు మల్లేశ్వరి, కొండేటి సుబ్బలక్ష్మి, మిద్దే మంగమ్మ, కోమటి సత్యవతి, కోమటి సుబ్బారావు, మిద్దే సత్యనారాయణ పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీలో జవాన్ కుమారుడి పుట్టినరోజు

ప్రజాశక్తి - పాలకోడేరు


కుమారుడికి కేక్ తినిపిస్తున్న తండ్రి జవాన్ భీమరాజు

ప్రస్తుత సమాజంలో పుట్టినరోజు వేడుకలకు భారీ సెట్టింగ్‌లు, కళ్యాణ మండపాలు నిలియంగా మారుతున్నాయి. వచ్చే అతిధులకు సైతం లక్షలాది రూపాయలు వెచ్చించి విందు భోజనం, రకరకాల గిఫ్ట్‌లు అందిస్తున్నారు. కానీ దేశం కోసం ప్రాణాలర్పించే ఒక జవాన్ తన కుమారుడి పుట్టినరోజు వేడుకల సందర్భంగా కొంతమందికి కడుపారా అన్నం పెట్టాలని భావించాడు. దేశ సరిహద్దుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలను రక్షిస్తూ విధులు నిర్వహించడమే కాకుండా కనీసం కొంతమందికైనా ఆకలి తీర్చాలనే ముఖ్య ఉద్దేశంతో తన కుమారుడి పుట్టినరోజు వేడుకలు లెప్రసీ కాలనీలో జరిపారు. శృంగవృక్షం, దుండిపేట ప్రాంతానికి చెందిన దుండి భీమరాజు భద్రాచలంలో సిఆర్‌పిఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నాడు. ఈయన కుమారుడు ధనుష్ చంద్ర పుట్టినరోజు వేడుకను శృంగవృక్షం లెప్రసీ కాలనీలో శుక్రవారం నిర్వహించారు. జవాన్ తండ్రి చంద్రపాల్, తల్లి దీనమ్మ, భార్య మౌనిక దేవి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో లెప్రసీ రోగుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా 70 మంది లెప్రసీ రోగులకు అన్నదానం చేశారు. అయితే ఎంతో ఆర్భాటంగా చేసుకోవలసిన పుట్టినరోజు వేడుకను లెప్రసీ కాలనీలో జరుపుకోవడం పట్ల జవాన్ భీమరాజును అభినందనలతో ముంచెత్తారు. భవిష్యత్తులో కూడా ఇదేరీతిలో కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దుండి అశోక్, నరసింహ, జంగం చిన్న, జి.పెద్దిరాజు, మంద ప్రవీణ్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో 'స్పెల్బీ' కాంటెస్ట్ !

ప్రజాశక్తి - భీమవరం టౌన్


విజేతలకు బహుమతి అందజేస్తున్న యాజమాన్యం

ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని సిఎస్‌డి, సిఎస్ఐటి విద్యార్థులు స్వయంగా తయారు చేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యార్థుల స్పెల్లింగ్ నాలెడ్జ్ సామర్థ్యాన్ని మూడు రౌండ్ల కాంటెస్ట్ ద్వారా పరీక్షించి 10 మంది విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేశారు. ఈ పోటీలను నెలరోజుల పాటు క్యాంపస్‌లోని స్టాల్స్, లాబ్స్‌లో నిర్వహించగా, కాలేజీ నుంచి 1000 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు 25 వేల విలువగల బహుమతులు స్మార్ట్ వాచెస్, విఆర్ హెడ్ సెట్స్, హెడ్ ఫోన్స్ వంటివి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు చేతులు మీదుగా అందజేయటం జరిగింది. మొదటి బహుమతి విజేతగా తమ్మ జయరామరాజు 'స్పెల్బీ చాంపియన్ 2024'గా ప్రకటించి బహుమతి ప్రదానం చేశారు. రెండు నుంచి ఐదవ స్థానాల వరకు ఉన్న విజేతలకు జియో డైవ్ విఆర్‌విఆర్ కిట్‌లు ప్రధానం చేశారు. ఆరు నుంచి పది స్థానాల వరకు ఉన్న విజేతలకు జిబ్రానిక్స్ హెడ్‌సెట్‌లు అందించబడ్డాయి. ఈ కార్యక్రమం సిఎస్‌డి, సిఎస్ఐటి, ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బిహెచ్‌విఎస్ రామకృష్ణంరాజు, ఐడియా ల్యాబ్ హెడ్ నూకల గోపాలకృష్ణమూర్తి, సిఎస్‌డి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ముదునూరి సురేష్ బాబు పాల్గొన్నారు.

పవన్‌కుమార్ తహాశీల్దార్‌గా రావడం పట్ల హర్షం

ప్రజాశక్తి - యలమంచిలి


తహాశీల్దార్‌ను కలిసిన పెదలంక గ్రామస్థులు

మండలంలోని పెదలంక గ్రామ సర్పంచి తాళ్ల నాగరాజు ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన నాయకులు శుక్రవారం తహాశీల్దార్ గ్రంధి పవన్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచి నాగరాజు మాట్లాడుతూ గతంలో గ్రంధి పవన్ కుమార్ డీటీగా చేసిన కాలంలో ప్రజలకు మంచి సేవలు అందించారని, మరలా ఇదే మండలానికి పవన్ కుమార్ తహాశీల్దార్‌గా రావడం ప్రజల అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట పెదలంక గ్రామస్తులతో పాటు కనకాయలంక గ్రామ మాజీ సర్పంచి కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాల పరిశుభ్రత పాటించుట ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక వీకర్స్ కాలనీ పరిధిలో 1వ వార్డ్, మాధవరం గ్రామంలో జరుగుతున్న ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటినిల్వలు లేకుండా చేసుకొని వారానికొకసారి ఫ్రై డే డ్రై డే పాటించినట్లయితే దొమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు టి.మణి, జయ మేరీ, మల్లిక, కార్యకర్తలు అరుణకుమారి, ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త కనకమహాలక్ష్మి, జాషీభాయి, సిబ్బంది ఆశాలు, స్వాతి దుర్గ, అమ్ములు, రమాబాయ్, వెంకటలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఏలూరి కాంతారావు పాల్గొన్నారు.

ఉండి: దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల అవగాహన కలిగించేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉండి మండలం పెద్దపుల్లేరు, కోలమూరు గ్రామాలలో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మైలాబత్తుల గులాబ్ రాజ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లోనూ, మురుగు బోదెలలోనూ దోమలు చేరి వైరల్ జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలను తీసుకొస్తాయన్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని వారు సూచించారు. అనంతరం కోలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరోగ్యం కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బి.సాయి చంద్ర, యండగండి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బిన్నీ సామ్యూల్, సబ్ యూనిట్ అధికారి భాస్కర రావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్.సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

ఉండి : నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా వ్యవహరిస్తాయని ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐ జగదీశ్వర్ రావు మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రజల ముందుకు వచ్చి మెయిన్ సెంటర్ లోనూ, దుకాణాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని, దొంగతనాలను నివారించే అవకాశం ఉంటుందని అన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, తదితర గతంలో జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులకు మూడో నేత్రంగా ఉపయోగపడుతుందన్నారు. ఉండి విద్యుత్ శాఖ సహాయక ఇంజనీర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులు బహిరంగ మార్కెట్లో ధాన్యం అమ్ముకోవచ్చు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రస్తుతం జరుగుతున్న సార్వా పంటకు వచ్చే ధాన్యం రైతులు బహిరంగ మార్కెట్లో స్వేచ్ఛగా అమ్ముకోవచ్చునని అధికారులు ప్రకటించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా తెరుస్తున్నామని చెప్పారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండలం కర్యాలయంలో తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో రైతులు, మిల్లర్లు, స్థానిక అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఎడి వివిఎస్.శ్రీనివాసరావు, ఎఒ ప్రియాంకలు మాట్లాడారు. మండలంలో ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం ద్వారా రైతులు ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ఎఒ ప్రియాంక తెలిపారు. వాటిలో చినకాపవరం, గురువారం కోళ్లపర్రు గ్రామంలో శుక్రవారం ఈ కేంద్రాలు ప్రారంభించామన్నారు. మండలంలో 3,982 ఎకరాలలో పంటలు చేశారని, అయితే వాటిలో తుఫాను, వరదలకు 2,100 ఎకరాల్లో పంట కుళ్లిపోయిందని, మిగిలిన 1,882 ఎకరాలలో పంట కొంతమేర సాగుతుందన్నారు. ఆ ధాన్యం ఒక క్వింటాల్‌కి రూ.2,300 సూపర్ ఫైన్ రూ.2,320 కొనుగోలు చేస్తామన్నారు. మిల్లర్లు ప్రయివేటుగా ధాన్యం కొనుక్కోవచ్చునని, అయితే కనీస మద్దతు ధర తగ్గకూడదన్నారు. తేమ 17 శాతం వరకు అనుమతిస్తారని, ఆపై అవసరమైతే బస్తాకి 600 గ్రాముల వరకు మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకోవచ్చునని తెలిపారు. తేమ శాతం పరిశీలించుకోదలుచుకున్న రైతులు ఎంఆర్ఒ కార్యాలయంలో బఫెర్ మిషన్ ఏర్పాటు చేశారని సమాచారం ఇచ్చారు. అదనపు సమాచారం కోసం తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

డాక్యుమెంట్ పోయినవి

శ్రీ పసుపులేటి రామ మోహనరావు, తండ్రి, గోపాల స్వామి, నూజివీడు మండలం నూజివీడు అను నాకు గల ఆస్తికి సంబంధించి డాక్యుమెంట్ నెంబర్ 1577/1957, 662/1963, 25 61/1968, 663/1963, లు మా ఇంటి వద్ద నుండి బ్యాంకు లోన్ నిమిత్తం తీసుకొని వెళుతుండగా పడిపోయినవి, కావున దొరికిన వారు ఈ కింది అడ్రస్ లో తెలియజేయగలరని మనవి చేస్తూ.

పసుపులేటి రామ మోహనరావు,
S/o.గోపాలస్వామి, డోర్ నెంబర్. 9-803
గాంధీనగర్ నూజివీడు, సెల్: 99597 24020

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెంకు చెందిన **కుంజం కొవ్వాడయ్య** గారి పేరు మీద గల 651/2000 దస్తావేజుకు 1002/1982 గల లింక్ దస్తావేజు & కుంజం జగదీశ్ పేరుమీద గల 7711/2012 గిఫ్ట్ డీడ్ & 1110/2013 రివోకేషన్ డీడ్ ఒరిజినల్స్ పోయినవి.దొరికినవారు ఈక్రింది అడ్రస్ నందు అందించగలరు.

కుంజం ప్రసాద్, S/o.కొవ్వాడయ్య,
D.No.13-37-3204, కొడాలి వారి వీధి,
జంగారెడ్డిగూడెం, pin. 534447.
సెల్.9491020479, 9908839139

పాస్‌పోర్టు పోయినది

ఆచంట మండలం, వల్లూరు పంచాయతీ పరిధి ఉత్తరపాలెం గ్రామానికి చెందిన **యల్లమెల్లి విజయ చంద్రబాబు**, తండ్రి రామారావుకు చెందిన. L8988158. పాస్ పోర్ట్ పోయినది. వల్లూరు ఉత్తరపాలెం నుంచి పాస్‌పోర్ట్‌ను సిస్టం ద్వారా పిడిఎఫ్ ఫైల్ చేయడానికి మోటార్ సైకిల్ పై ఆచంట వెళ్తుండగా పాస్ పోర్ట్ కలిగిన కవరు మార్గమధ్యలో పడిపోయినది. ఎంత వెతికినా ఎక్కడ దొరకలేదు. కావున నా పాస్పోర్ట్ ఎవరికైనా దొరికితే ఈ కింది అడ్రస్కు తెలియపరచగలరు.

యల్లమిల్లి విజయ చంద్రబాబు, S/o.రామారావు
డోర్ నెంబర్ 2-51/1. ఉత్తరపాలెం, వల్లూరు
ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా,
ఆంధ్రప్రదేశ్. పిన్:534269. సెల్: 9618977363

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం మండలం, పసలదీవి గ్రామానికి చెందిన జోగి వెంకటలక్ష్మి, W/o.శ్రీరామమూర్తి అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం.Y2906212 ది.1-9-2024 తేదీన నా యొక్క లగేజ్‌తో పసలదీవి గ్రామంలో ఉన్న మా ఇంటి వద్దకు వెళ్లి అక్కడ నాయొక్క పాస్‌పోర్టు పెట్టిన బ్యాగ్ మరియు లగేజ్ అంతా అక్కడ పెట్టినాను. నేను మా చుట్టాల ఇళ్ల వద్దకు వెళ్లి అందరినీ పలకరించి నా కుమారుడి పెళ్లి పనులలో నిమగ్నమయ్యాను. తరువాత చూసుకుంటే నా యొక్క పాస్‌పోర్టు పెట్టిన బ్యాగ్ కనిపించలేదు. ఎంతవెతికినా దొరకలేదు. కావున ఎవరికైన దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

జోగి వెంకటలక్ష్మి, W/o.శ్రీరామమూర్తి,
పసలదీవి, నర్సాపురం మండలం, ప.గో.జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు : పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు.

ఐ.ఎ.నెం.1/2024

ఎ.ఎస్.ఆర్.నెం.12860/31-10-2023

శ్రీమతి కొత్తపల్లి లలిత కుమారి ...పిటీషనర్/అప్పిలెంట్

మరియు

శ్రీ గాదిరాజు సత్యనారాయణ మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు

పిటిషనరు పై నంబరు అప్పీలు దాఖలు చేయుటలో జరిగిన 20 రోజుల ఆలస్యము క్షమించమని పిటీషను దాఖలు చేయగా సదరు పిటీషనులో 2వ రెస్పాండెంట్ శ్రీమతి గాదిరాజు నాగవల్లి, భర్త గాదిరాజు శ్రీరామరాజు గారికి నోటీసు నిమిత్తం ది.13-12-2024వ తేదీ వాయిదా అయివున్నది. కాబట్టి సదరు 2వ రెస్పాండెంటు, సదరు తేదీ ఉదయం గం.10.30 ని.లకు పైకోర్టు వారి ఎదుట హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకోవలెనని ఈ ప్రకటన ద్వారా తెలియ చేయడమైనది.

ఏలూరు — ఎస్.వి.ఆర్.గాంధీ
తేది:21.11.2024 — పిటీషనరు తరపు అడ్వకేట్

ప్రకటన

నా క్లయింట్ శ్రీ కోమటి వెంకట సుబ్రహ్మణ్యం తండ్రి రామకృష్ణ (లేటు) వారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించిన యాజమాన్య బదిలీలు సదరు దస్తావేజు నెం.లు 87/2021, 3634/1985, 3694/1981గా జరిగాయి. అయితే ద.నెం. 3634/1985 గల డాక్యుమెంట్ ప్రయాణంలో పోయినది. ఈ దస్తావేజు సంబంధిత పోలీసు ఫిర్యాదు, దొరకబడని ధృవీకరణ నెం. MLD 012400455332గా నమోదు జరిగినది. సదరు ఆస్తికి సంబంధిత మ్యుటేషన్ హక్కులు సుబ్రహ్మణ్యం గారి పేరుపై కలవు. **షెడ్యూల్ ఆస్తి వివరాలు :** పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం రిజిస్ట్రీ జిల్లా, ఆకివీడు సబ్.డి., ఆకివీడు మండలం మరియు పంచాయతీ, ఆర్.యస్.నెం. 470/4 రు అసెస్మెంటు నెం. 1188003345 లు, 69.73 చ.గ. హద్దులు : తూర్పు : పైడిరాజు, పడమర : రోడ్డు, ఉత్తరం: పి.శ్రీను, పి.రాము, దక్షిణం : పి.సీతారాం

పైన తెలిపిన కోమటి వెంకట సుబ్రహ్మణ్యం గారు ఎ.యు. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో గృహరుణం పొందుచున్నారు. కావున సదరు ఆస్తిపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు వున్న యెడల ఏడు దినములలోగాపు ఈ నా/మా సంతకం దారుని అడ్రస్‌కి లిఖిత పూర్వకంగా తెలియజేయగలరు. లేనియెడల ఎవరికి ఏ విధమైన అభ్యంతరాలు లేవని భావించి లోను పొందుట జరుగును. గడువు తర్వాత ఏ విధమైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు మా క్లయింట్ లేదా రుణదాతను గాని ఏ విధమైన స్థిరపరచజాలవని యావన్మందికి తెలియ జేస్తున్నాను.

ఇట్లు
కె.సర్వేశ్వరరావు,
కె.అలేఖ్య,
న్యాయవాదులు,
డోర్ నెం. 14-482, భగత్‌సింగ్ నగర్, యన్‌టిఆర్ బస్టాప్ ప్రక్కన, యనమలకుదురు. విజయవాడ. ఫోన్ : 95818 73334.